క్లుప్తంగా

అంబేడ్కర్‌కు వినతిపత్రం



వినతిపత్రాన్ని ఇస్తున్న జేఏసీ ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: దేశం పేరును మార్చినంత మాత్రాన ప్రధాని మోదీ ఏమాత్రం గొప్పోడు కాలేదని కార్మిక సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల కిరణ్‌కుమార్ అన్నారు. అసలు ఆయనకు ఆ అర్హత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందించి మాట్లాడారు. భారత రాజ్యాంగంలో పౌర హక్కును ఏవిధంగానైనా తెలియ జేసుకునే హక్కును కలిగి ఉందన్నారు. దీన్ని ఇండియా అన్ని ఉచ్చరించకుండా భారత్ అనే నినాదాన్ని తీసుకురావడం మోదీ సర్కారు దురహంకారానికి నిదర్శనమన్నారు. నోట్ల రద్దు సమయంలో భారత్ అనే నినాదం ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం దేశ ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. నాయకులు పల్లవిప్రేమ రాజు, వికాస్, మోతె శంకర్, ఎదునూరి ప్రశాంత్, దొబ్బల నరేష్, ఎర్రవెల్లి విజయ్ పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై సంబురాలు



క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్, రైతులు

గంభీరావుపేట: మండల కేంద్రం నుంచి లక్ష్మీపూర్ తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 3.8 కోట్లు మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు, ప్రజాప్రతినిధులు సంబురాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. సర్పంచ్ కటకం శ్రీధర్ పంతులు ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏళ్లనాటి రోడ్డు కష్టాలు ఇక తీరినట్లేనని రైతులు హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకు కృషిచేసిన మంత్రి కేటీఆర్‌కు, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, సర్పంచ్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

రజక కార్పొరేషన్‌కు కృషి చేయండి

- ఎమ్మెల్సీ సారయ్యను కలిసిన ఏఎంసీ చైర్మన్



ఎమ్మెల్సీతో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్

ముస్తాబాద్: రజక కార్పొరేషన్ ఏర్పాటు అయ్యేలా కృషి చేయాలని ఎమ్మెల్సీ సారయ్యను కలిసి విజ్ఞప్తి చేసినట్లు పోతుగల్ ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌లో గురువారం ఆయనను కలిసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇప్పటికే ఆధునిక పద్ధతుల్లో దోబీఘాట్లు ఏర్పాటు చేసి, రజకులకు ఉచిత కరెంట్ ఇస్తున్నారన్నారు. అలాగే బీసీ రుణాల్లో రజకులకు ప్రాధాన్యతను కల్పించారన్నారు. రజక కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీని కోరడం జరిగిందన్నారు. రజకుల అభివృద్ధి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోనే జరిగిందన్నారు.

ఆరేళ్లయినా.. అతీగతి లేదు

- పదవీకాలం ముగుస్తున్నా ముందుకు సాగని పనులు
- గ్రహణం వీడని పంచాయతీ భవనాల నిర్మాణాలు
- పోతుగల్‌లో ముందుకు రాని కాంట్రాక్టర్
- గోపాల్‌పల్లె, తెర్లుమద్దిలో దొరకని స్థలం

ముస్తాబాద్: పల్లెల్లో మౌలిక వసతుల కల్పన, ప్రజల మంచి చెడ్డలను చూసుకునే పంచాయతీ కార్యాలయాలకు అన్ని హంగులు ఉండాలి. సుపరిపాలన అందించేందుకు కార్యాలయాలు అన్ని వసతులతో ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్యం అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. ముస్తాబాద్ మండలంలో ఆరేళ్ల క్రితం మంజూరైన పంచాయతీ భవనాల నిర్మాణాలకు ఇప్పటికీ అతీగతి లేకపోవడమే ఇందుకు నిదర్శనం. ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది, పోతుగల్ పంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధిహామీ ద్వారా నిధులు మంజూరు చేసింది. ఇప్పటికీ ఆ పనులు మొదలు కాలేదు. ఇక గోపాల్‌పల్లె నూతన పంచాయతీ నిర్మాణానికి నిధులు మంజూరైనా, పనులు మొదలు పెట్టలేదు.



పోతుగల్‌లో పాత జీపీ భవనం కూల్చివేసి, కొత్త భవనానికి కేటాయించిన స్థలం

మొదలవ్వని పనులు

తెర్లుమద్ది, పోతుగల్ గ్రామాల్లో 50 ఏళ్ల క్రితం నిర్మించిన పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో పోతుగల్ పంచాయతీ భవనానికి ఉపాధిహామీ, సీడీఎస్ నిధుల ద్వారా రూ.25 లక్షలు, తెర్లుమద్దిలో ఉపాధిహామీ ద్వారా రూ.16 లక్షలు, గోపాల్‌పల్లెకు రూ.16 లక్షలు మంజూరు చేశారు. పోతుగల్, తెర్లుమద్ది పెద్ద గ్రామాలే. అలాగే మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి నాయకులు ఉన్న గ్రామాలే. 2018లో నూతన పంచాయతీ భవనాల నిర్మాణానికి పంచాయతీరాజ్ ఉపాధిహామీ ద్వారా నిధులు మంజూరు చేసింది. ఇప్పటికీ పనులు ప్రారంభించకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధిహామీ ద్వారా మంజూరైన పనులకు బిల్లులు సరిగా రావడం లేదని భవనాలు నిర్మించేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని భావిస్తున్నారు. పైగా పనులు తొలుత ఆలస్యం కావడంతో, పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులు పెంచాలన్న సర్పంచుల ప్రతిపాదనలకు మోక్షం లభించడం లేదు. ఆరేళ్ల క్రితం సిమెంట్, స్టీల్, ఇటుక ధరలకు నేటి ధరలకు పొంతన లేదని సర్పంచులు అంటున్నారు.

ఇరుకు గదుల్లో ఇక్కట్లు

పోతుగల్, తెర్లుమద్ది రెండు పంచాయతీ భవనాలు చాలా ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఈ రెండు భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఎప్పుడు కూలుతాయో తెలియదు. పంచాయతీ కార్మికులు, కార్యదర్శి, కారోబార్ కూర్చుండే వీలు లేదు. ఇక సందర్శకులు వస్తే కనీసం నిలబడే చోటు లేదు. పైగా పైపులైన్లు, మోటార్లు, వీధిదీపాల సామాన్లతో ఉన్న రెండు గదులు నిండిపోయాయి. ఇంటి పన్నులు, కరెంట్ బిల్లులు.. ఇతరత్రా పనుల కోసం వచ్చే వారు చిన్న గదులతో ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఉద్యోగులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. పంచాయతీ రికార్డులను, సమావేశ మందిరాల్లోనే ఉంచే పరిస్థితి వుంది.

స్థలాల కొరత అసలు సమస్య

గోపాల్‌పల్లె, తెర్లుమద్దిలో పంచాయతీ కార్యాలయాల నిర్మాణానికి స్థలం సమస్యగా మారింది. గోపాల్‌పల్లెలో ఊరంతా పట్టా భూముల్లోనే ఉండగా, తెర్లుమద్దిలో స్థలం కోసం రెండేళ్లుగా అన్వేషణ చేస్తున్న దొరకని పరిస్థితి నెలకొంది. పోతుగల్‌లో 50 ఏళ్ల నాటి పాత పంచాయతీ భవనాన్ని ఆరు నెలల క్రితం పడగొట్టారు. అక్కడ నూతన భవనాన్ని నిర్మించేందుకు సర్పంచ్ ముందుకు వచ్చారు. అయితే పెరిగిన ధరలతో భవనం ఎలా పూర్తవుతుందనేది ఆయన ప్రశ్న. తెర్లుమద్ది, గోపాల్‌పల్లెలో స్థలం సమస్య వెంటాడుతుండగా, పోతుగల్‌లో నిధులు సరిపోవనే ఉద్దేశ్యంతో కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. ప్రస్తుత సర్పంచుల పదవీకాలం మరో ఐదు నెలల్లో ముగుస్తుండగా నూతన పంచాయతీ కార్యాలయం నిర్మాణం కలగానే మిగిలిపోతుందని భావిస్తున్నారు.

త్వరలో పనులు చేపడతాం



ఆరేళ్ల క్రితమే నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు నిర్మించేందుకు ముందుకు రాలేదు. దీంతో పనులు ఆలస్యమయ్యాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వారు పట్టించుకోలేదు. మేమే చొరవ చూపి పాత భవనాన్ని పడగొట్టి కొత్త కార్యాలయం కట్టేందుకు ముందుకు వచ్చాం. రెండు రోజుల్లో పనులు మొదలుపెడుతాం.

– తన్నీరు గౌతంరావు, సర్పంచ్, పోతుగల్

స్థలం లభించడం లేదు



తెర్లుమద్దిలో గ్రామానికి అనుకొని ప్రభుత్వ స్థలం దొరకడం లేదు. ప్రైవేటుగా కొందామన్న ధరలు అధికంగా ఉన్నాయి. పాత భవనం పూర్తిగా శిథిలమైంది. ధరలు పెరగడంతో పనులు చేపట్టేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. పాత భవనం స్థానంలోనే కొత్తది కడితే బాగుంటుంది.

– కొలకొండ కిషన్‌రావు, సర్పంచ్, తెర్లుమద్ది

ప్రతిపాదనలు పంపిస్తాం



గోపాల్‌పల్లె, తెర్లుమద్దిలో ప్రభుత్వ స్థలం లభించలేదు. పోతుగల్‌లో త్వరలో పనులు ప్రారంభిస్తాం. పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులు పెంచాలని సర్పంచులు కోరుతున్నారు. ఈమేరకు ప్రతిపాదనలు పంపిస్తాం. కార్యాలయాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.

– ఇనాయతుల్లా, ఏఈ, పంచాయతీరాజ్

శ్రీకృష్ణాష్టమి సంబురాలు



రుద్రంగి ఇందిరా చౌక్‌లో ఉట్టికొడుతున్న యువత



సిరిసిల్ల శ్రీకృష్ణ మందిరంలో..



ఉట్టి కొడుతున్న యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మిరాల భాస్కర్ యాదవ్



వేములవాడ వేణుగోపాలస్వామి ఆలయంలో..

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్/సిరిసిల్లఎడ్యుకేషన్/వేములవాడ/ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/కోనరావుపేట/తంగళ్లపల్లి/రుద్రంగి/బోయినపల్లి: జిల్లాలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సిరిసిల్ల శ్రీకృష్ణ ధ్యాన మందిరంలో, వేములవాడ వేణుగోపాలస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించారు. పలుచోట్ల ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. సిరిసిల్ల కొత్త బస్టాండులో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మిరాల భాస్కర్ వేడుకలు ప్రారంభించారు. పట్టణ అధ్యక్షుడు జగ్గాని మల్లేశంయాదవ్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్యయాదవ్ పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో రథోత్సవం నిర్వహించారు.



కృష్ణుని వేషధారణలో బుడతడు

రాజన్న ఆలయంలోని దర్గాకు తాళం

- ఇరువర్గాల గొడవ
- పొసగని పొత్తుల వ్యవహారం
- పోలీసుల రంగప్రవేశం

వేములవాడ: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే వేములవాడ రాజన్న ఆలయంలోని దర్గా నిర్వహణ వివాదాస్పదంగా మారింది. గత కొన్నేళ్లుగా పట్టణానికి చెందిన 12 కుటుంబాల మధ్య ఈ దర్గా పొత్తుల వ్యవహారం కొనసాగుతోంది. ఏడాదికొకరు నిర్వహణ బాధ్యతలు చూసుకుంటున్నారు. ఈక్రమంలో ఓ వర్గానికి చెందిన వారు హైకోర్టును ఆశ్రయించి పొత్తుల వ్యవహారంపై ఆర్డర్ తెచ్చుకున్నారు. కోర్టు ఉత్తర్వులు పొందిన వ్యక్తులు గురువారం ఆలయంలోకి చేరుకుని వచ్చే మహాశివరాత్రి వరకు కాలపరిమితితో కొనసాగుతున్న వారు ఖాళీ చేయాలని గొడవకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పొత్తుల వ్యవహారం తేలే వరకు ఎవరూ దర్గాలో ఉండవద్దని సూచిస్తూ దర్గాకు తాళం వేయించారు. ఓ ముస్లిం పోలీసు అధికారిని అక్కడ నియమించారు. ఇరువర్గాలను ఠాణాకు పిలిపించి విచారిస్తున్నారు. ఇరువర్గాలు రాజీ కుదుర్చుకుని భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



దర్గాకు తాళం వేసి ఉంచిన దృశ్యం

కొనసాగుతున్న చెక్‌డ్యాం తొలగింపు పనులు

వేములవాడరూరల్: మండలంలోని బొల్లారం గ్రామం వద్ద ఉన్న చెక్‌డ్యాం తొలగింపు పనులు ఇంకా కొనసాగుతున్నాయి. లింగంపల్లి, బొల్లారం మధ్యన మూలవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం ఇటీవల కురిసిన వర్షాలతో నీరు భారీగా చేరి రెండు గ్రామాల ప్రజలకు ప్రమాదకరంగా మారింది. ఈ విషయంపై చెక్‌డ్యాం తొలగించాలని కాంట్రాక్టర్ల ఆదేశాలతో గ్రామస్తులు మూడు రోజులుగా పనులు కొనసాగిస్తున్నారు. గురువారం కూడా జేసీబీల ద్వారా నూతనంగా నిర్మించిన చెక్‌డ్యాంను తొలగించే పనిలోనే ఉన్నారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన చెక్‌డ్యాంను తొలగించడంతో రెండు గ్రామాల ప్రజలు అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



బొల్లారంలో చెక్‌డ్యాంను తొలగిస్తున్న సిబ్బంది

సమాచారం

నేడు టెట్ నిర్వహణపై సమీక్ష

సిరిసిల్లఎడ్యుకేషన్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ముందుగా అవసరమైన టెట్ పరీక్ష నిర్వహణపై శుక్రవారం సమీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి రమేశ్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఫైనాన్షియల్ లిటరసీ స్పెషలిస్టు పోస్టు

సిరిసిల్లకల్చరల్: స్త్రీ, శిశు, దివ్యాంగ, వయోవృద్ధులశాఖలో ఖాళీగా ఉన్న ఆర్థిక అక్షరాస్యత నిపుణుడి పోస్టును ఒప్పంద ప్రాతిపదికన నియమించేందుకు నిర్ణయించింది. ఆర్థిక, బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన డిగ్రీ, పీజీ పూర్తిచేసిన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తెలిపారు. సంబంధిత రంగంలో మూడేళ్ల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. జిల్లా వెబ్‌సైట్ నుంచి సేకరించిన దరఖాస్తును అవసరమైన అన్ని అర్హత పత్రాలతో ఈనెల 8లోపు అందజేయాలని తెలిపారు. ఈనెల 12న సర్టిఫికెట్ల పరిశీలన, 14న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, ఎంపికైన వారికి నెలకు రూ.22,750 వేతనం ఉంటుందని తెలిపారు.

గ్రంథాలయానికి ఫర్నీచర్ వితరణ

ముస్తాబాద్: మండలంలోని మోహినికుంటలో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి సర్పంచ్ కల్వకుంట్ల వనజ ఫర్నీచర్, ర్యాక్స్‌ను గురువారం అందజేశారు. అలాగే బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి గ్రంథాలయానికి అవసరమైన గ్రంథాలను, ఇతర పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ వెంకటస్వామి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాల్లో వేగం పెంచాలని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో జెడ్పీటీసీ నిధులతో నిర్మాణంలో ఉన్న భవనం పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సరైనా భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సకాలంలో అందుబాటులోకి తేవాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ గొట్టె సురేందర్ తల్లి అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులవి న్యాయమైన డిమాండ్లు

సిరిసిల్లటౌన్: సమగ్ర శిక్ష ఉద్యోగులవి న్యాయమైన డిమాండ్లను వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర సర్కారుపై ఉందని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రాంనాథ్‌రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం అన్నారు. గురువారం సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలకు వారు సంఘీభావం తెలిపి మాట్లాడారు. తెలంగాణ వచ్చిన తరువాత కాంట్రాక్టు వ్యవస్థ ఉండదని, అందరినీ రెగ్యులరైజ్ చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ వాగ్దానాన్ని నెరవేర్చుకోవాలని కోరారు. ఈ విషయంలో మంత్రి కేటీఆర్ చొరవ తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. టీపీటీఎఫ్, ఏఐటీయూసీ తదితర యూనియన్లు సంఘీభావం తెలిపారు.

పొన్నంను కలిసిన నాయకులు

ఎల్లారెడ్డిపేట: మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ నాయకులు గురువారం కరీంనగర్‌లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పొన్నంకు బొకే అందించి, శాలువాతో సన్మానించారు. ప్రభాకర్‌గౌడ్ హుస్నాబాద్ నుంచి పోటీ చేయనున్న నేపథ్యంలో ఆయనకు మద్దతు పలికారు. జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సాహెబ్, జిల్లా కిసాన్ ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా డబుల్ ఇళ్లు

సిరిసిల్లఅర్బన్: పెద్దూరులో ప్రభుత్వం నిర్మించి పంపిణీ చేయకుండా వదిలేసిన డబుల్ బెడ్రూం ఇళ్లు మందుబాబులకు అడ్డాగా మారాయని కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గంభీరావుపేట ప్రశాంత్ ఆరోపించారు. గురువారం డబుల్ బెడ్రూం ఇళ్లను సందర్శించి మాట్లాడారు. నిరుపేదలకు ఇళ్లు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వెంటనే అర్హులకు ఇళ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణయ్య, యాదయ్య, కనకయ్య, శ్రీను, రమేశ్, శేఖర్, రాజనర్సు, అక్షయ్, అఖిల్, అనిల్ పాల్గొన్నారు.

దివ్యాంగ అన్నా చెల్లెల్లకు బీసీబంధు

- చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్
- ట్విట్టర్ పోస్టుకు స్పందన రూ.10 వేల ఆర్థికసాయం

బోయినపల్లి: పుట్టు దివ్యాంగులైన మండలంలోని దేశాయిపల్లి గ్రామానికి చెందిన అన్నా, చెల్లెలు కల్యాణం వేణు, సాగిరికకు బీసీ బంధు యూనిట్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. వీరి ఇబ్బందులపై వారి సోదరుడు కల్యాణం సాయి ట్విట్టర్‌లో చేసిన పోస్టు చూసిన ఎమ్మెల్యే, దేశాయిపల్లి గ్రామసర్పంచ్ ఒంటెల రాజగోపాల్‌రెడ్డితో వెళ్లి బాధితులను పరామర్శించి, రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. నాయకులు కొంకటి మదూకర్, తల్లి కొమురవ్వ ఉన్నారు. కాగా 2020 ఫిబ్రవరి 3న 'వయసు పెరుగుతున్నా.. పసి పిల్లలే' శీర్షికన ఈ అన్నా చెల్లెల్ల దీనస్థితిపై సాక్షిలో కథనం ప్రచురితమైంది.



ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

పరామర్శ

ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన కొలుపుల శ్రీకాంత్, ఎర్రగడ్డం స్వాగత్‌రెడ్డి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. సర్పంచ్ లచ్చయ్య, ముద్దం రవి, కంకణాల పురుషోత్తంరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజ్జూ పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి అండగా ఉంటాం

ముస్తాబాద్: బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన ముస్తాబాద్‌కు చెందిన అనమేని నర్సింలు రైతు కుటుంబానికి మానవతావాదులు అండగా నిలుస్తున్నారు. రైతు కుటుంబానికి అండగా ఉంటామని కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి నగదు సాయం చేశారు. అలాగే ఆర్‌బీఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, ఉపసర్పంచ్ వేముల రవీందర్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు డాక్టర్ ఎరవెల్లి చంద్రశేఖర్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చక్రధర్‌రెడ్డి, తస్లీమా అంజుమ్ ట్రస్టు చైర్మన్ నవాజ్, ముదిరాజ్ సంఘం తరఫున రూ.5 వేల చొప్పున రైతు కుటుంబానికి అందజేశారు. ఇద్దరు చిన్నారుల చదువులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇంకా 50 మంది వరకు తమకు తోచిన విధంగా నగదును అందించారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఈ పృథ్వీధర్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు స్థానిక సెస్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు గురువారం ప్రయత్నించారు. ఈ సమాచారం అందుకున్న సెస్ ఏఈ పృథ్వీధర్‌గౌడ్ వెంకటాపూర్‌కు వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. అర్బన్ ఫీడర్ మంజూరై మూడు నెలలు గడుస్తున్న పనులు ప్రారంభించడం లేదని గ్రామస్తులు తెలపడంతో, సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, బ్లాక్ కేబుల్ వైర్‌ను తొలగించి అర్బన్ ఫీడర్ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి పరిష్కారమార్గం చూపుతామన్నారు. దీంతో ముట్టడిని తాత్కాలికంగా విరమించుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేడిశెట్టి బాలయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు గుర్రాల రాజిరెడ్డి, గడ్డం రవి, దుర్గం శ్రీకాంత్, సెస్ ప్రతినిధులు నాగుల శ్రీనివాస్, చాకలి రాజయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మురుగు నీటి కాలువల్లో ఆయిల్‌బాల్స్

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో పారిశుధ్య చర్యలను పకడ్బందీగా చేపట్టామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు తెలిపారు. మురుగు కాల్వల్లో దోమల నివారణకు ఆయిల్‌బాల్స్‌ను వదిలామన్నారు.

జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం

ఎల్లారెడ్డిపేట: జాతీయస్థాయి అవార్డు గ్రహీత స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డిని ఆయన మిత్ర బృందం గురువారం సన్మానించింది. నాయకులు మట్ట వెంకటేశ్వరరెడ్డి, కుంబాల సుధాకర్‌రెడ్డి, గంగాడి సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

గంభీరావుపేట: మండల కేంద్రంలో వెంకటాద్రి చెరువు కట్టపై ఉన్న శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు.

పేదలకు అన్నదానం

వేములవాడ: రాజన్న గుడి ప్రాంతంలో మై వేములవాడ ట్రస్టు ప్రతినిధులు గురువారం 150 మందికి అన్నదాం చేసినట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

పుస్తెమట్టెలు వితరణ

వీర్నపల్లి: మండలంలోని మద్దిమల్ల గ్రామంలో పాల ఉత్పత్తిదారుడు ఇస్కిల్ల గంగమల్లయ్య కుమార్తె పెళ్లికి కరీంనగర్ పాల డెయిరీ ఆధ్వర్యంలో డైరెక్టర్ లింబాద్రి పుస్తెమెట్టెలను అందజేశారు.

టాయ్‌లెట్స్ ప్రారంభం

వేములవాడఅర్బన్: వేములవాడ శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ కంపెనీ రూ. 3.25 లక్షలతో నిర్మించిన మోడ్రస్ గర్ల్స్ టాయ్‌లెట్స్‌ను కంపెనీ వైస్ ప్రెసిడెంట్ సోముగౌదర్ గురువారం ప్రారంభించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మారం కుమార్, హెచ్‌ఎం చిలుక గట్టు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామంలో వెంకట్‌రెడ్డికి రూ.60 వేలు, సంధ్యకు రూ.42 వేలు, ప్రవళికకు రూ.30 వేలు, రజితకు రూ.20 వేలు, వర్షిణికి రూ.15 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ శివజ్యోతి పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్‌కు గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు భూక్య సీత్యానాయక్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. తిమ్మాపూర్ నుంచి కిష్టునాయక్ తండాకు ద్విచక్ర వాహనంపై గురువారం వెళుతుండగా కుక్కలు అడ్డుగా రావడంతో వాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. వాహనంపై ఉన్న మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. ఇద్దరిని చికిత్స కోసం అస్పత్రికి తరలించారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు పరామర్శించారు.